క్లుప్తంగా

నేడు సినీ సంగీత విభావరి

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో ఆదివారం సాయంత్రం 5:30 గంటల నుంచి స్వర మాధురి కల్చరల్ యూనిట్ ఆధ్వర్యాన సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు యూనిట్ ఖమ్మం అధ్యక్షుడు ఆదిరాజు పురుషోత్తం, నిర్వాహకులు ఆరెపల్లి పున్నయ్య, ఎస్‌పీ ఇమామ్‌లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు, మహ్మద్ రఫీ ఆలపించిన తెలుగు, హిందీ గీతాలను గాయకులు ఆలపిస్తారని, కళాపోషకులు, కళాభిమానులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు కరెంట్ కోత

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని ఎన్నెస్పీ సబ్ స్టేషన్ 11 కేవీ వైరా రోడ్ ఫీడర్ మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 9 నుంచి 11 గంటలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఖమ్మం టౌన్–2 ఆపరేషన్స్ ఏఈ నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా సరితక్లినిక్ సెంటర్, రిలయన్స్ స్మార్ట్ ఏరియా, వైరారోడ్ ప్రాంతంలో విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

పాలాభిషేకం..



పాలాభిషేకం చేస్తున్న గ్రామస్తులు

రఘునాథపాలెం: మండలంలోని సుకునితండా నుంచి మంచుకొండకు బీటీ రోడ్డు మంజూరు చేసినందుకు గాను హర్షం వ్యక్తం చేస్తూ సుకునితండా గ్రామస్తులు మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ చిత్రపటానికి శనివారం పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో హరియాతండా సర్పంచ్ మాలోత్ కాంతి, ఉప సర్పంచ్ మాలోత్ దేశియానాయక్, నాయకులు ప్రసాదు, చందు, కిషన్‌నాయక్, వార్డు సభ్యులు రాజనాయక్, శంకర్, రవి శంకర్, రాజానాయక్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై దాడులకు సమాధానం చెప్పాలి



సమావేశంలో మాట్లాడుతున్న జనార్ధన్

ఖమ్మంమయూరిసెంటర్: దేశ హితమే తమ లక్ష్యమని చెప్పుకుంటున్న కేంద్ర ప్రభుత్వ పెద్దలు దేశంలో మహిళలపై జరుగుతున్న దాడులు, ప్రభుత్వ రంగ ఆస్తుల అమ్మకాలు దేనికి నిదర్శనమో చెప్పాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.జనార్ధన్ డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని ఇఫ్టూ జిల్లా కార్యాలయంలో జరిగిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. మణిపూర్‌లో మహిళలపై దాడులు, ఊర్లు వదిలి వెళ్లేలా హింసలకు పాల్పడుతున్నా మోదీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దారుణం అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా కార్మికులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సంఘ జిల్లా అధ్యక్షుడు షేక్ సుభాహన్, ప్రధాన కార్యదర్శి ఐ.వెంకన్న, నాయకులు రవి, వీరస్వామి, రామ్మూర్తి, పటేల్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో తిరు కల్యాణ మహోత్సవ వేడుకలకు సంబంధించిన పోస్టర్లను శనివారం దేవాలయం కార్యనిర్వహణాధికారి పి.నారాయణచార్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 26, 27 తేదీల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు తూపురాణి మధుసూదనాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

గ్రామ సభలు ప్రారంభం

కూసుమంచి: మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులపై నిర్వహించే సామాజిక తనిఖీల గ్రామసభలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 18 వరకు ఆయా గ్రామ పంచాయతీల్లో కొనసాగనుండగా.. తొలిరోజు తురకగూడెం, జీళ్లచెరువు, ముత్యాలగూడెం, ధర్మాతండా గ్రామ పంచాయతీల్లో నిర్వహించారు. ఇట్టి పంచాయతీల్లో చేపట్టిన పనుల వివరాలను సభల్లో చదివి వినిపించారు. అభ్యంతరాలను స్వీకరించారు. 19వ తేదీన మండల పరిషత్ కార్యాలయంలో ఓపెన్ ఫోరంను నిర్వహించనున్నట్లు ఈజీఎస్ ఏపీఓ అప్పారావు తెలిపారు.

నగరంలో సినిమాలు

తిరుమల	బేబి, భోళాశంకర్
వినోద	జైలర్
సాయిరాం	భోళాశంకర్
ఆదిత్య	బ్రో
శ్రీనివాస	భోళాశంకర్
సుందర్	ఉస్తాద్

- ఖమ్మంగాంధీచౌక్



భిన్నమైన బ్యాడ్జీలు



వివిధ డిజైన్లలో అలంకరణ సామగ్రి



పలు సైజుల్లో జాతీయ జెండాలు

హర్ ఘర్ తిరంగా..

సండే స్పెషల్

మొదలైన పంద్రాగస్టు సందడి..

- జోరుగా మువ్వన్నెల జెండా విక్రయాలు
- మార్కెట్‌లోకి భిన్నమైన బ్యాడ్జీలు, బ్యాండ్లు
- క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు, యువత జోష్
- వేడుకలకు సిద్ధమవుతున్న ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు
- ఆర్డర్లపై స్వీట్ దుకాణాలు బిజీబిజీ



కస్బా బజార్‌లోని ఓ దుకాణంలో విక్రయానికి సిద్ధంగా ఉన్న జాతీయ జెండాలు, త్రివర్ణ దండలు

ఖమ్మంగాంధీచౌక్: పంద్రాగస్టు పండుగ సందడి ప్రారంభమైంది. దేశ వ్యాప్తంగా కుల, మత, ప్రాంతాలకు అతీతంగా అందరూ ప్రతి ఏటా ఆగస్టు 15వ తేదీన నిర్వహించే 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జరుపుకునేందుకు భారత జాతి సర్వం సన్నద్ధమవుతోంది. 'హర్ ఘర్ తిరంగా'పేరిట ప్రతి ఇంటా జెండా పండుగను జరుపుకోవాలని కేంద్ర ప్రభుత్వం పిలుపునిచ్చింది. ఎందరో మహానుభావులు త్యాగాలతో 1947వ సంవత్సరంలో దేశానికి సిద్ధించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జెండా పండుగగా అంతా పిలుచుకుంటారు. ఈ పండగ రోజు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యా సంస్థల్లో ఆయా సంస్థల ప్రతినిధులు కార్యాలయాలపై జాతీయ జెండాలను ఎగురవేసి నాటి స్వాతంత్ర్య పోరాట మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ విద్యార్థుల్లో జాతీయ భావాలను పెంపొందించేలా అనేక క్రీడలు, వక్తృత్వ, ఉపన్యాస పోటీలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. గెలుపొందిన విజేతలకు స్వాతంత్ర్య దినోత్సవం రోజున బహుమతులు అందిస్తారు.

భిన్నమైన తోరణాలు, బ్యాడ్జీలు, బ్యాండ్‌లు..

స్వాతంత్ర్య ఉత్సవాలను దృష్టిలో పెట్టుకొని భిన్నమైన తోరణాలు, బ్యాడ్జీలు, బ్యాండ్లు, టోపీలు, కండువాలు, రిస్ట్ బ్యాండ్స్, తల బ్యాండ్స్‌ను విక్రయిస్తున్నారు. పిల్లలు పట్టుకొని తిరిగే విధంగా, ద్విచక్రవాహనాలకు పెట్టుకొనేలా చిన్న త్రివర్ణ పతాకాలు మార్కెట్‌లో విరివిగా లభ్యమవుతున్నాయి. ఇక జాతీయ నాయకుల చిత్ర పటాలు, మూడు రంగులతో ఉన్న దండలు, తోరణాలను సైతం అమ్ముతున్నారు.

జాతి గర్వించే మువ్వన్నెల జెండా..

స్వాతంత్ర్య దినోత్సవం అంటే ముందుగా గుర్తుకు వచ్చేది జాతీయ జెండా. స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకునే రోజున జాతీయ జెండాను ఆవిష్కరించడానికి ఉన్న ప్రాధాన్యతను గుర్తించి మార్కెట్‌లో జాతీయ జెండాలను జోరుగా విక్రయిస్తున్నారు. ఓ జాతి అస్తిత్వం, ఐకమత్యం, ధర్మాలను తెలిపే ఈ జాతీయ జెండాలను ఎంతో అందంగా ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతూ ఆవిష్కరిస్తున్నారు. భారత జాతి ఆశలు, ఆశయాలు ప్రతిబింబించేలా వర్ణాలతో జాతీయ జెండా ఆవిష్కృతమై ఉంది. కాషాయం దేశం పట్ల ప్రజల త్యాగాన్ని, ఆత్మస్థైర్యాన్ని ప్రతిబింబిస్తుంటే, మధ్యలో ఉన్న తెలుపు స్వచ్ఛత, శాంతి, నిజాయితీని 'తెలుపు'తుంది. కింద ఉన్న ఆకుపచ్చ విశ్వసనీయత, ప్రకృతి, పాడి పంటలు, సంపదను సూచిస్తుంది. మానవ ధర్మాన్ని ప్రబోధించే అశోకుడి ధర్మచక్రం నీలిరంగులో నిజాయితీకి ప్రతీకగా నిలుస్తుంది. నిబంధనలకు అనుగుణంగా జాతీయ జెండాలను రూపొందించి దుకాణాల్లో విక్రయిస్తున్నారు. 12''18 సైజు మొదలు 40''60 సైజుల్లో జాతీయ జెండాలను నాణ్యతను బట్టి రూ.15 నుంచి రూ. 300ల వరకు విక్రయిస్తున్నారు. జెండాను ఎగురవేసేందుకు అవసరమైన నూలు తాళ్లు, థర్మాకోల్ బాల్స్ వంటివి కూడా విక్రయిస్తున్నారు.

మిఠాయిలకూ.. డిమాండ్

స్వాతంత్ర్య దినోత్సవం నాడు జాతీయ జెండాను ఎగురవేసి మిఠాయిలు, చాక్లెట్లు, బిస్కెట్లు, స్వీట్లు కూడా పంచిపెడుతుంటారు. ఈనేపథ్యంలో విద్యా సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల నిర్వాహకులు మిఠాయిల కోసం ఆర్డర్లు ఇస్తున్నారు.

పిల్లలకు నచ్చినవి కొంటాం..



జాతీయ భావాలు ప్రతి ఒక్కరిలో పెంపొందించాలి. అందు కోసం తనవంతుగా ప్రతి ఏటా స్వాతంత్ర్య దినోత్సవం నాడు తాను బ్యాడ్జీని ధరించటంతో పాటు పిల్లలకు కూడా బ్యాడ్జీలను పెట్టి పాఠశాలకు పంపిస్తా. మార్కెట్‌లో భిన్నమైన, ఆకర్షణీయమైన జాతీయ పతాకాలు, బ్యాడ్జీలు, బ్యాండ్లు లభించడంతో పిల్లలకు ఇష్టమైనవి కొనిపెడతాం.

- కె.శ్రీనివాస్, కోఆర్డినేటర్, చైల్డ్‌లైన్

వేడుకలో తప్పక పాల్గొంటా..



స్వాతంత్ర్య దినోత్సవం వచ్చిందంటే ఓ పండుగే. ఆ రోజు తప్పక నూతన దుస్తులు ధరించి జేబుకు ఓ బ్యాడ్జీ ధరించి వ్యవసాయ మార్కెట్‌లో నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొంటా. ఇక మనువలు, మనువరాళ్లకు ఇష్టమైన బాడ్జీలు, బ్యాండ్లు కొనిస్తా. రిటర్డ్ ఉద్యోగులమంతా కలిసి కట్టుగా పాల్గొంటాం.

- డి.తిరుపతయ్య, రిటైర్డ్ మార్కెట్ కమిటీ ఉద్యోగి

ట్రెండ్‌కు తగ్గట్టుగా జెండాలు..



లేటెస్ట్ ట్రెండ్‌కు తగ్గట్టుగా త్రివర్ణ వస్తువులు తయారవుతున్నాయి. యువత, విద్యార్థులు ఆకర్షించే బ్యాడ్జీలు, బ్యాండ్లు, చిన్న జెండాలు అందుబాటులోకి వచ్చాయి. ఇక జాతీయ జెండాలు, తోరణాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. తలకు టోపీలు, టవల్స్ కూడా విక్రయిస్తున్నాం. ఆర్డర్లు ఇస్తే టీషర్టులు కూడా తెప్పించి విక్రయిస్తున్నారు.

- ఎం.శ్రీనివాసరావు, శ్రీనివాస ట్రేడర్స్, కస్బాబజార్

అందుబాటులో జాతీయ పతాకాలు



జాతీయ జెండాను విక్రయిస్తున్న బీపీఎం కణతాల గోవిందరావు

నేలకొండపల్లి: మండలంలోని కోరట్లగూడెం, కోనాయిగూడెం, నేలకొండపల్లి గ్రామాల్లోని తపాలా కేంద్రాల వద్ద అమృత్ మహోత్సవంలో భాగంగా శనివారం బీపీఎం కణతాల గోవిందరావు ఆధ్వర్యాన హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ తపాలా కేంద్రాల వద్ద 45 జెండాలను ఉంచి ఒక్కో జెండా రూ.25 చొప్పున విక్రయిస్తున్నట్లు తెలిపారు.

అమృత్ సరోవర్ చెరువుల వద్ద జెండా పండగ

నేలకొండపల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన అమృత్ సరోవర్ చెరువులకు జలకళ సంతరించుకుంది. అందుకు కారణమైన ఉపాధి కూలీలను ఆగస్టు 15న స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా సన్మానం చేయనున్నట్లు తెలిసింది. సరోవర్ చెరువుల వద్ద జెండా పండగ సంబరాలు నిర్వహించనున్నట్లు మండల అధికారులు తెలిపారు. గతేడాది మాదిరిగానే స్వాతంత్ర్య సమర యోధులను సన్మానించనున్నారు.

సమస్యలు పరిష్కరించాలి

తిరుమలాయపాలెం: ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని కేవీపీఎస్ పాలేరు ఇన్‌చార్జ్ పాపిట్ల సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కమిటీ ఆధ్వర్యాన తిరుమలాయపాలెం మండల కేంద్రంలోని హాస్టళ్లను పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. హాస్టళ్ల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయని, ఎస్టీ హాస్టల్‌లో కొందరి విద్యార్థినులకు యూనిఫామ్ అందలేదని, మెనూ అమలు కావడం లేదని చెప్పారు. సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు రాము, సురేష్, నాయకులు రామనాథం, రమేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బలవంతపు భూసేకరణ సరికాదు..



ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు



రఘునాథపాలెం: పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్/రఘునాథపాలెం: అమరావతి–నాగపూర్ గ్రీన్‌ఫీల్డ్ హైవేకు రైతుల నుంచి తక్కువ ధరలకు భూములు తీసుకునే ప్రయత్నం చేయడాన్ని నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యాన శనివారం నగరంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరరావు, యర్రా శ్రీకాంత్‌లు మాట్లాడుతూ.. హైవే అలైన్‌మెంట్ మార్చాలని, రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలని అనేకసార్లు ప్రభుత్వానికి వినతి పత్రాలు ఇచ్చినా స్పందించలేదన్నారు. అలాగే రైతులకు సరైన నష్టపరిహారం ఇవ్వకుండా, ఎలాంటి సమాచారం లేకుండా సర్వే చేయడం సరైంది కాదని తక్షణమే సర్వేను నిలిపేయాలని జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మొక్కశేఖర్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈమేరకు రైతులను, రైతు సంఘాల నాయకుల అరెస్ట్ నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన పోలీస్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. రైతులను నిర్బంధించి, అరెస్టు చేసి వారి నుంచి బలవంతంగా భూములను లాక్కోవడాన్ని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం (ఏఐపీకేఎస్) ఖమ్మం జిల్లా అధ్యక్ష ,కార్యదర్శులు మలీదు నాగేశ్వరరావు, ఆవుల వెంకటేశ్వర్లు తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేషనల్ హైవే పేరుతో పోలీస్ పహారా మధ్య బలవంతపు భూసేకరణ చేపట్టడం సరైనది కాదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావులు వేర్వేరు ప్రకటనల్లో ఖండించారు. రైతుల అనుమతి లేకుండా బలవంతంగా అరెస్టులు చేసి భూములను సేకరిస్తే రైతాంగం పెద్ద ఎత్తున ఉద్యమిస్తారని ప్రభుత్వాన్ని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమాల్లో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు భారతి, వై.విక్రమ్, భూక్యా వీరభద్రం, రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బాలాజీ నాయక్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పుచ్చకాయల వీరభద్రం, కార్పొరేటర్ మలీదు వెంకటేశ్వర్లు, జిల్లా కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కొంటెముక్కల నాగేశ్వరరావు, నాయకులు మాదినేని రమేష్, శ్రీనివాసరావు, మెరుగు సత్యనారాయణ, బండి పద్మ, నందిపాటి మనోహర్, బషీర్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐ ఉద్యోగానికి ఎంపికైన పేదింటి ఆడబిడ్డ



మనీషను సత్కరిస్తున్న కార్పొరేటర్

ఖమ్మంమయూరిసెంటర్: తల్లిదండ్రుల కష్టాన్ని చూసిన ఓ పేదింటి ఆడబిడ్డ ఎస్‌ఐ ఉద్యోగానికి ఎంపికై వారి కష్టానికి ప్రతిఫలం చూపించింది. నగరానికి చెందిన మిడిదొడ్డి రాజయ్య, ఆండాళు దంపతులకు కుమార్తె మనీష, కుమారుడు ఉపేందర్‌లు ఉన్నారు. వీరు గత ఇరవై ఏళ్ల క్రితం బతుకుదెరువు కోసం నల్లగొండ జిల్లా నుంచి ఖమ్మం వచ్చి స్థిరపడ్డారు. ఈనేపథ్యంలో మనీష ఇటీవల టీఎస్‌పీఎస్సీ విడుదల చేసిన ఫలితాల్లో ఎస్‌ఐగా ఉద్యోగం సాధించింది. ఈమేరకు శనివారం 46 డివిజన్ కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్న కృష్ణ సత్కరించి అభినందించారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

తిరుమలాయపాలెం: మండలంలోని దమ్మాయిగూడెంలో రూ.40లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సర్పంచ్ ఆలస్యం నాగేశ్వరరావు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి రాంలాల్, వార్డు సభ్యులు నర్సయ్య, సాయి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్‌టీఎఫ్‌ఐ ఆవిర్భావ దినోత్సవం

ఖమ్మంసహకారనగర్: అశాస్త్రీయ నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు పరచాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు చావా దుర్గాభవాని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం యూటీఎఫ్ భవన్‌లో నిర్వహించిన స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీఎఫ్‌ఐ) ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ఆమె మాట్లాడారు.ఆదాయ పన్ను పరిమితిని రూ.8లక్షలకు పెంచాలని, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు జీవీ నాగమల్లేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు, నాయకులు బండి నరసింహారావు, బుర్రా వెంకన్న, షమీ, వల్లంకొండ రాంబాబు, షేక్ రంజాన్, నరసయ్య, గీత, సురేష్, సతీష్ ,నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'రెజొనెన్స్' విద్యార్థులకు అభినందన

ఖమ్మంసహకారనగర్: వరంగల్ జీడబ్ల్యూఎంసీ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన 8వ నేషనల్ షాటోకోస్ కరాటే చాంపియన్‌షిప్‌ను రెజొనెన్స్ కళాశాలకు చెందిన సయ్యద్ ఆదిల్‌పాషా, కె.సాయిచరణ్ అండర్–16 విభాగంలో కై వసం చేసుకున్నారని కళాశాల డైరెక్టర్స్ ఆర్.వీ.నాగేంద్రకుమార్, కొండా శ్రీధర్‌రావు తెలిపారు. శనివారం ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు సతీష్, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉచిత వైద్యసేవలు

ఖమ్మం మామిళ్లగూడెం: రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా సంచార ఉచిత వైద్యసేవలు అందిస్తున్నట్లు రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ వెలిగేటి చంద్రమోహన్, వైస్ చైర్మన్ ఆర్.రవీందర్‌రావు అన్నారు. శనివారం ఖమ్మంలో ఉచిత వైద్య సేవలను వారు ప్రారంభించిన సందర్భంగా వారు మాట్లాడారు. ఖమ్మంతో పాటు చింతకాని మండలం బస్వాపురం తదితర గ్రామాల్లో పేదలకు వైద్య పరీక్షలతో పాటు మందులు అందిస్తున్నట్లు తెలిపారు. రిటైర్డు ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.దామోదర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, సీతారామయ్య, వెంకటరెడ్డి, సంస్థ సభ్యులు జిల్లా వెంకటేశ్వర్లు, జనార్ధన్‌రావు, శ్రీహరి, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, సింధుప్రియ పాల్గొన్నారు.

బీఎస్పీ నేతల ధర్నా



ధర్నా చేస్తున్న బీఎస్పీ నేతలు

ఖమ్మం మామిళ్లగూడెం: ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అరెస్టు అప్రజాస్వామికం అని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బుర్ర ఉపేంద్రసాహు అన్నారు. శనివారం అరెస్టును వ్యతిరేకిస్తూ ఖమ్మం జిల్లా గ్రంథాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రూప్–2 పరీక్షను వాయిదా వేయాలని ప్రవీణ్‌కుమార్ చేపట్టిన సత్యాగ్రహ దీక్షను భగ్నం చేసి, రాష్ట్ర కార్యాలయాన్ని దహనం చేయటం ఎంతవరకు సమంజసమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పుల్లయ్య, నాగేశ్వరావు, నాగరాజు, మంజుల, రజిని, అనిత, చంద్రమోహన్, విజయ్, రాంబాబు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాలు..



నిత్యావసరాలు అందిస్తున్న బాబూరావు

ఖమ్మంరూరల్: మున్నేరు వరద బాధితులకు ఖమ్మం లయన్స్ ఇంటర్ నేషనల్ ఆధ్వర్యాన శనివారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నిత్యావసరాలు పంపిణీ చేశారు. మొత్తం 140 మంది బాధితులకు రూ.1.54లక్షల విలువైన నిత్యావసరాలు, బెడ్ షీట్లు అందించారు. ఈ సందర్భంగా లయన్స్ డైరెక్టర్ ఘట్టమనేని బాబూరావు మాట్లాడుతూ.. బాధితులకు అండగా నిలవాలనే ఉద్దేశంతో పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ గవర్నర్ సీహెచ్. శివప్రసాద్, లయన్ డాక్టర్ రాఘవరెడ్డి, లయన్ మోదుకూరి. మురళీధర్‌రావు, క్లబ్ ప్రెసిడెంట్ లయన్ కృష్ణారెడ్డి, కార్యదర్శి వి.హనుమంతరావు, ఎంపీపీ బెల్లం ఉమ, జనార్ధనాచారి, నంబూరి మధు, కె.విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంలను పర్మనెంట్ చేయాలి

ఖమ్మం మామిళ్లగూడెం: ఏఎన్‌ఎంలను పర్మనెంట్ చేయాలని తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు భూపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఖమ్మం మంచికంటి మీటింగ్ హాల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కొండల్‌రావు, వేణుగోపాల్, వీరయ్య, నాగప్రసాద్, లక్ష్మి, స్వాతి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల హక్కులను కాలరాస్తున్న బీజేపీ



అభివాదం చేస్తున్న గిరిజన సంఘం నాయకులు

రఘునాథపాలెం: దేశవ్యాప్తంగా గిరిజన తెగలపై దాడులు చేస్తూ రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలపై గిరిజన తెగలు ఐక్యంగా పోరాడాలని గిరిజన సంఘాల నేతలు పిలుపునిచ్చారు. ప్రపంచ ఆదివాసీ గిరిజన దినోత్సవం సందర్భంగా శనివారం మండలంలోని పరికలబొడుతండాలో తెలంగాణ గిరిజన సంఘం, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం ఆధ్వర్యాన గిరిజనులకు చిహ్నం అయిన ఆకుపచ్చ జెండాను ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ చంద్రం నాయక్, ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో గుగులోత్ కుమార్ నాయక్, ఖమ్మం నగర అధ్యక్షుడు తేజావత్ అనిల్‌నాయక్, హర్యతండా మాజీ సర్పంచ్ బానోత్ బాబు మాట్లాడుతూ.. ఉద్యమ నాయకుల స్ఫూర్తితో పోరాడాలని పిలుపునిచ్చారు. తెలంగాణ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ కుమార్‌నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు భూక్యా శంకర్ నాయక్, గ్రామ పెద్దలు తేజావత్ బన్సిలాల్, తేజావత్ వెంకట్రాం, మోహన్‌లాల్, బానోత్ చాంప్లా తదితరులు పాల్గొన్నారు.

యువజన సంఘాల ఆధ్వర్యాన దిష్టిబొమ్మ దహనం



ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: గ్రూప్–2 పరీక్ష వాయిదా వేయాలని డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తుందని ఆరోపిస్తూ వామపక్ష యువజన సంఘాలు పీవైఎల్,డీవైఎఫ్ఐ,ఏఐవైఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నగరంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌజ్ వద్ద ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్, పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శులు బషీరుద్దీన్, ఎస్‌వీ.రాకేష్, ఏఐవైఎఫ్ రాష్ట్ర నాయకుడు శ్రావణ్‌లు మాట్లాడారు. ప్రభుత్వం స్పందించి పరీక్షను రెండు నెలల పాటు వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు కూసు మోహన్‌రెడ్డి, మామిడాల వెంకటేశ్వర్లు, సత్తెనపల్లి నరేష్, చింతల రమేష్, భూక్య ఉపేందర్, పఠాన్ రోషినిఖాన్, మాడపాటి సుజాత, దిండు మంగపతి, కూరపాటి శ్రీను, పొన్నం మురళి, విజయ్, రావులపాటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్–2 పరీక్ష వాయిదా వేయాలి..

తెలంగాణలో నిర్వహించనున్న గ్రూప్–2 పరీక్ష సమయంలోనే అనేక పరీక్షలు ఉన్నందున అభ్యర్థుల అభ్యర్థన మేరకు పరీక్షను వాయిదా వేయాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఖమ్మం డివిజన్ కార్యదర్శి ఆవుల అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక రామనరసయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగస్టులో సుమారుగా 21 పోటీ పరీక్షలు నిర్వహిస్తున్నందున అభ్యర్థుల్లో అయోమయ పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి ఝాన్సీ, రాయల రవికుమార్, వన్‌టౌన్ కార్యదర్శి కొమరయ్య, టూ టౌన్ కార్యదర్శి సత్తార్, నరసింహారావు, సురేష్ పాల్గొన్నారు.